

ఉష్ణోగ్రత : గరిష్ఠం 38.4 కనిష్ఠం 19.7

రంజాన్ వేళలు
ఇఫ్తార్: 6:33 (శనివారం సాయంత్రం)
సహర్: 4:56 (ఆదివారం ఉదయం)



రాజేంద్రనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రంలో జవాబు పత్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి

99.01%

'పది' పరీక్షలకు విద్యార్థుల హాజరు

తొలిరోజు ప్రశాంతంగా ఎగ్జామ్

రాజేంద్రనగర్ ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్



చౌదరిగూడ : పరీక్ష కేంద్రంలోకి వీల్‌చైర్‌పై వస్తున్న విద్యార్థి

పరీక్ష వివరాలు	రెగ్యులర్	ప్రైవేట్
విద్యార్థులు	51,604	94
హాజరు	51,096	71
గైర్హాజరు	508	23
శాతం	99.01	75.53

రంగారెడ్డి అర్బన్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో పదో తరగతి పరీక్షలు మొదటి రోజు ప్రశాంతంగా జరిగాయి. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు నిర్వహించిన పరీక్షల కోసం విద్యార్థులు గంట ముందుగానే సెంటర్ల వద్దకు చేరుకున్నారు. ఉదయం 9.35 గంటలకు పరీక్ష కేంద్రాల గేట్లు మూసివేశారు. కేంద్రాల వద్ద అధికారులు విద్యార్థులను క్షుణ్ణంగా తనిఖీ చేసి లోపలికి పంపించారు. ఒక్క నిమిషం నిబంధన తీసివేయడంతో పరీక్ష ప్రారంభమైన ఐదు నిమిషాల వరకు కూడా విద్యార్థులను పరీక్ష హాల్లోకి

మిగతా 8వ పేజీలో...



శంకర్‌పల్లి మోడల్ స్కూల్ పరీక్ష కేంద్రంలోకి వెళ్తున్న విద్యార్థులు



కందుకూరు : నేదునూరు ఆదర్శ పాఠశాలలో పరీక్ష రాయడానికి వచ్చిన విద్యార్థి



మొయినాబాద్ రూరల్ : అజీజ్‌నగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల హాల్‌టికెట్లను పరిశీలిస్తున్న సిబ్బంది





పరీక్ష కేంద్ర వద్ద హాల్‌టికెట్ నెంబర్‌ను చూసుకుంటున్న విద్యార్థులు

మద్యానికి డబ్బులు ఇవ్వలేదని..

» గొడ్డలితో భార్యను నరికి చంపిన భర్త

» అయ్యవారిపల్లిలో ఘటన

షాద్‌నగర్‌రూరల్, మార్చి21(ఆంధ్రజ్యోతి): తాగుడుకు డబ్బులు ఇవ్వలేదని ఓ వ్యక్తి కట్టుకున్న భార్యనే కిరాతకంగా చంపిన ఘటన షాద్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ విజయ్ కుమార్, గ్రామస్తుల కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. అయ్యవారిపల్లి గ్రామానికి చెందిన పిచ్చకుంట్ల పరశురాములు ఏ పని చేయకుండా మద్యానికి బానిసై జులాయిగా తిరుగుతుండే వాడు. తాగుడుకు డబ్బులు ఇవ్వాలని భార్య జమున (38)తో తరచూ గొడవ పడేవాడు. గురువారం రాత్రి కూడా ఇదే విషయంపై ఘర్షణ పడ్డాడు. ఆమె డబ్బులు లేవని చెప్పడంతో ఆగ్రహించిన పరశురాం రాత్రి 11.30 గంటల సమయంలో ఇంట్లో ఉన్న గొడ్డలితో భార్య మెడపై నరకడంతో అక్కడికక్కడే మృతి చెందింది. ఇంట్లో నుంచి అరుపులు వినిపించడంతో పక్కింటిలో ఉండే చీమల మల్లేష్ వెళ్లి చూడగా యమున రక్తపు మడుగులో విగతజీవిగా పడి ఉంది. మల్లేష్‌ను చూసి పరశురాములు పరారయ్యాడు. చుట్టు పక్కల వాళ్లు వచ్చి పోలీసులకు సమాచారం ఇచ్చారు. సంఘటనా స్థలానికి చేరుకున్న ఇన్‌స్పెక్టర్ విజయ్ కుమార్ ఘటనపై విచారణ చేశారు. అనంతరం మృతదేహాన్ని షాద్‌నగర్ కమ్యూనిటీ ఆసుపత్రికి తరలించారు. నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించారు.

నిర్వహణకు నిధులేవి?



31 నెలలుగా రైతు వేదికలకు విడుదల కాని ఫండ్స్

సాగులో రైతులకు సలహాలు, సూచనలు ఇచ్చేందుకు జిల్లాలో ఏర్పాటు చేసిన రైతువేదికలు సమస్యలతో సతమతమవుతున్నాయి. 31 నెలలుగా ప్రభుత్వం నిర్వహణ నిధులు విడుదల చేయక వేదికలు నిస్తేజంగా మారాయి. కరెంటు బిల్లు, పారిశుధ్య నిర్వహణ, స్టేషనరీ, తాగునీటి సౌకర్యాల కల్పనకు డబ్బులు లేక ఏఈవోలు, ఏఈవోలు ఇబ్బంది పడుతున్నారు. వీటికోసం అధికారులు సొంత డబ్బు ఖర్చు చేయాల్సి వస్తోంది. అంతేకాకుండా రైతు వేదికల్లో విద్యుత్ బకాయిలు పేరుకుపోవడంతో ఎప్పుడు కరెంట్ కట్ చేస్తారో తెలియని పరిస్థితి నెలకొంది.

భారంగా విద్యుత్ చార్జీలు, పారిశుధ్య పనులు

వీడియో కాన్ఫరెన్స్‌ల నిర్వహణతో అదనపు భారం

సొంత డబ్బు ఖర్చు చేస్తున్న ఏవో, ఏఈవోలు

అటెండర్, స్వీపర్లు లేక అవస్థ పడుతున్న అధికారులు

రంగారెడ్డి జిల్లాలో 83 రైతు వేదికలు

కనకమామిడి రైతు వేదిక





12 కిలో మీటర్లు వెళ్లాలి

మాది మేడిపల్లి గ్రామం. వ్యవసాయమే జీవనాధారం. వ్యవసాయంలో రాణించాలని నా తపన. మేడిపల్లి నుంచి చిలుకూరు రైతు వేదికకు 12 కిలోమీటర్ల దూరం ఉంది. రైతు వేదికల నిర్వహణ సరిగ్గా లేదు. సరైన సూచనలు సలహాలు అందటం లేవు.

కొత్తపల్లి సురేందర్, రైతు, మేడిపల్లి, మొయినాబాద్ మండలం



ఊరికి దూరంగా ఉన్న చేవెళ్ల రైతు వేదిక

రంగారెడ్డి అర్బన్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయ శాఖ సేవలను రైతులకు మరింత చేరువ చేసే లక్ష్యంతో గత ప్రభుత్వం క్లస్టర్ల వారీగా రైతు వేదికలను నిర్మించింది. శాఖాపరంగా రైతులకు ఆధునిక సాగు విధానంపై సలహాలు, సూచనలు ఇవ్వాలనేది దీని ప్రధాన లక్ష్యం. ఇంత వరకు బాగానే ఉన్నప్పటికీ రైతు వేదికల నిర్వహణపై పట్టింపు లేకుండా పోయింది. ఏళ్ల తరబడి నిర్వహణ నిధులు మంజూరు చేయకపోవడంతో రైతు వేదికల లక్ష్యం ఆశించిన మేర ముందుకు సాగడం లేదు. రూ.కోట్ల బకాయిలు పేరుకుపోవడంతో వీటి నిర్వహణ ఏఈవోలకు భారంగా మారింది. జిల్లాలో 83 రైతు వేదికలను నిర్మించేందుకు రూ.18.26 కోట్లు మంజూరు చేసింది. ఒక్కో రైతు వేదిక నిర్మాణానికి రూ.22 లక్షల వరకు ఖర్చు చేశారు. 150 నుంచి 200 మంది కూర్చునే

మిగతా 8వ పేజీలో...

వంద శాతం పన్ను వసూలు చేయాలి

» జిల్లా పంచాయతీ అధికారి సురేష్ మోహన్



ఇంటి పన్ను వసూలు తీరును పరిశీలిస్తున్న డీపీవో

కేశంపేట, మార్చి 21(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీలలో వంద శాతం ఆస్తి పన్ను వసూలు చేయాలని జిల్లా పంచాయతీ అధికారి(డీపీవో) సురేష్ మోహన్ సూచించారు. మండలంలో శుక్రవారం ఆయన పర్యటించారు. సంగెం గ్రామంలో ట్యాక్స్ వసూళ్ల తీరును పరిశీలించారు. కొందరి నుంచి పన్ను వసూలు చేసి రసీదులు అందించారు. అనంతరం కేశంపేట మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశమయ్యారు. వేసవిని దృష్టిలో పెట్టుకుని గ్రామాలలో తాగునీటి సమస్య రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఎప్పటికప్పుడు పారిశుధ్య నిర్వహణ చర్యలు చేపట్టాలని సూచించారు. తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలని తెలిపారు. ఎల్‌ఆర్‌ఎస్‌కు 25శాతం రాయితీ ఇస్తున్న విషయంపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఎక్కువ ప్లాట్లు రెగ్యులరైజ్ అయ్యేవిధంగా చూడాలన్నారు.

మిషన్ భగీరథ ట్యాంకు పనుల పరిశీలన

సంగెం గ్రామంలో మిషన్ భగీరథ వాటర్ ట్యాంకు మరమ్మతు పనులను డీపీవో పరిశీలించారు. పనులు జరుగుతున్న తీరును అధికారులను అడిగి తెలుసుకున్నారు. త్వరగా పూర్తిచేసి, ట్యాంకులోని నీటిని ఎక్కించి, ప్రజలకు సరఫరా చేయాలన్నారు. డీపీవో వెంట షాద్‌నగర్ డీఎల్‌పీవో మల్లారెడ్డి, కేశంపేట ఎంపీడీవో రవిచంద్రకుమార్ రెడ్డి, ఎంపీవో కిష్టయ్య ఉన్నారు.

కొత్త మండలాలు.. పాతచోటే కార్యాలయాలు

● ఇబ్బందుల్లో ప్రజలు ● పట్టించుకోని పాలకులు

7

» అప్పటివరకు ఉద్యమం ఆగదు

» జేఏసీ చైర్మన్ వత్తుల రఘుపతి

మహేశ్వరం మండలాన్ని ఫ్యూచర్ సిటీలో కలపాలి

మహేశ్వరం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : మహేశ్వరం మండలంలోని అన్ని గ్రామాలను ఫ్యూచర్ సిటీలో విలీనం చేసేంత వరకు ఉద్యమం ఆగదని జేఏసీ చైర్మన్ వత్తుల రఘుపతి, కె. జంగయ్యయాదవ్ అన్నారు. మండల పరిధిలోని అఖిలపక్ష నాయకులు శుక్రవారం అమీర్‌పేటలోని ఓ ఫంక్షన్ హాలులో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని తుమ్మలూరు, మొహబ్బత్‌నగర్‌లను మాత్రమే ఫ్యూచర్‌సిటీలో కలపడం సరికాదని, మిగిలిన అన్ని గ్రామాలను కలపాలని డిమాండ్ చేశారు. ఆ దిశగా చొరవ చూపాలని సీఎం రేవంత్, జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యే సబితారెడ్డి, ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కేఎల్లార్, తదితరులకు వినతి పత్రాలు సమర్పిస్తామన్నారు. సమావేశంలో కళాకారుల ఆటాపాట, మహిళల బతుకమ్మ పాటలు అలరించాయి. సమావేశంలో మల్లేష్ యాదవ్, కర్నాటి మనోహర్, కె. జంగయ్యయాదవ్, కాకి ఈశ్వర్, రాజునాయక్, అంద్యానాయక్, టి. యాదీష్, కందిరమేష్, బి. నర్సింహ్మాయాదవ్, యాదయ్యగౌడ్, ఆంజనేయులు, రవి, శివ, సురేష్, దత్తునాయక్, చంద్రయ్య, సుదర్శన్‌యాదవ్, కాసాని వెంకటేష్‌గౌడ్, శ్రావణ్, రాజునాయక్, పాండునాయక్, రాయప్ప పాల్గొన్నారు.



సమావేశంలో అభివాదం చేస్తున్న ఫ్యూచర్ సిటీ జేఏసీ నాయకులు

పనులు వేగవంతం చేయాలి

» కలెక్టర్ నారాయణరెడ్డి

రంగారెడ్డి అర్బన్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : రెడ్డి హాస్టల్, విద్యాసంస్థల భవన సముదాయాల పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ నారాయణరెడ్డి ఆదేశించారు. బుద్వేల్ గ్రామ పరిధిలో కేటాయించిన 15 ఎకరాల స్థలంలో రాజా బహదూర్ వెంకట్‌రాంరెడ్డి ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో రూ.13.63 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న రెడ్డిహాస్టల్, విద్యాసంస్థల భవన సముదాయాల పనులను ఆయన శుక్రవారం పరిశీలించారు. రూ.10 కోట్లు ఓడీఎఫ్ తమ వాటాగా నిధులు విడుదల చేసిందన్నారు. మిగతా రూ.3కోట్ల 63 లక్షలు సొసైటీ తమ వాటాగా విడుదల చేసినట్లు తెలిపారు. పనులు కొంత కాలంగా నిలిచిపోవడానికి గల కారణాలను సంబంధిత కాంట్రాక్టర్‌ను అడిగి తెలుసుకున్నారు. ఇప్పటికైనా పనులను వేగిరం చేసి త్వరగా పూర్తి చేయాలన్నారు. కలెక్టర్ వెంట రాజా బహదూర్ వెంకట్‌రాం రెడ్డి, ఎడ్యుకేషనల్ సొసైటీ అధ్యక్షుడు వెంకట్ రంగారెడ్డి, సెక్రటరీ మోహన్‌రెడ్డి, పంచాయతీ రాజ్ ఈఈ రామకృష్ణ, డీఈ ఖలీమొద్దీన్, తహసీల్దారు రాములు ఉన్నారు.

రూ.5.59లక్షలకు తైబజార్ వేలం



పంచాయతీలో నిర్వహించిన తైబజార్ వేలంలో పాల్గొన్న గ్రామస్తులు, అధికారులు

కందుకూరు, మార్చి 21(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ప్రతి ఆదివారం నిర్వహిస్తున్న అంగడి తైబజార్‌ను రూ.5.59లక్షలకు గ్రామానికి చెందిన కొమ్మగళ్ల యాదగిరి వేలంలో దక్కించుకున్నారని ఎంపీడీవో, పంచాయతీ ప్రత్యేక అధికారి సరిత తెలిపారు. శుక్రవారం పంచాయతీ కార్యాలయంలో వేలం నిర్వహించగా యాదగిరి అత్యధిక మొత్తం తైబజార్ (అంగడిలో ఫీజు వసూలు) హక్కును దక్కించుకున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీవో గీత, పంచాయతీ కార్యదర్శి వి.సురేందర్‌గౌడ్, సింగిల్ విండో డైరెక్టర్ శేఖర్‌రెడ్డి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ఇక్ఫాయ్‌లో ఘనంగా 'త్రితి' వేడుకలు



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

శంకర్‌పల్లి, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు సాంకేతిక నైపుణ్యాన్ని పెంపొందించుకునేందుకు 'త్రితి' వంటి కార్యక్రమాలు దోహదపడుతాయని ఇక్ఫాయ్ వర్సిటీ వైస్ చాన్స్‌లర్ ఎల్ఎస్.గణేష్ అన్నారు. దొంతాన్‌పల్లిలోని ఇక్ఫాయ్ కాలేజీలో త్రితి-2025 మూడు రోజుల వార్షిక సాంస్కృతిక సంబరాలను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మనిషికి విద్యతో పాటుక్రీడలు, సాంఘిక, సాంస్కృతిక కార్యక్రమాలు అవసరమన్నారు. వాటితో సృజనాత్మకత, గుణాత్మకత వెలికి వస్తుందన్నారు.రిజిస్ట్రార్ విజయలక్ష్మి మాట్లాడుతూ విద్యార్థులు కలిసికట్టుగా పాల్గొనాలని సూచించారు. పలువురు డైరెక్టర్లు, అధ్యాపకులు పాల్గొన్నారు.

సీఎంను కలిసిన నాబార్డ్ చైర్మన్, ఎమ్మెల్యే



తాండూరు, మార్చి 21(ఆంధ్రజ్యోతి): నాబార్డు చైర్మన్ షాజీ కేవీతో కలిసి తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిశారు. శుక్రవారం హైదరాబాద్‌లో సీఎంను మర్యాదపూర్వకంగా కలిసి సాగునీటి వనరులు, అభివృద్ధి పనుల నిధులపై చర్చించారు. తాండూరు ప్రాంతానికి కావాల్సిన నిధులను నాబార్డు ద్వారా కేటాయిస్తామని ఇందుకు ప్రతిపాదనలు పంపాలని ఎమ్మెల్యేకు సీఎం సూచించారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం



కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

కందుకూరు, మార్చి 21(ఆంధ్రజ్యోతి): నేదునూరులో వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ధర్మకర్త కాసుల అంజిరెడ్డి ఆధ్వర్యంలో పండితులు రామశర్మ నేతృత్వంలో కల్యాణోత్సవాన్ని మాజీ సర్పంచ్ రామకృష్ణారెడ్డి, సోలిపేట అమరేందర్‌రెడ్డి దంపతులు జరిపించారు. ఈ నెల 23 వరకు బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తామని అంజిరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో మాజీ వైస్ఎంపీపీ జి.శమంతప్రభాకర్‌రెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన



రంగారెడ్డి అర్బన్, మార్చి 21(ఆంధ్రజ్యోతి): నందిగామలో నూతనంగా నిర్మించిన అయ్యప్ప ఆలయంలో శుక్రవారం ధ్వజస్తంభ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. షాద్‌నగర్ మాజీ కౌన్సిలర్ వేణుగోపాల్ ఆర్థిక సహకారంతో ధ్వజస్తంభాన్ని ఏర్పాటు చేశామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. వేణుగోపాల్ దంపతులు, మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్, నాయకులు, గ్రామస్థులు పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు జె.బాల్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, రామన్న, హరిజీవన్, సుదర్శన్‌గౌడ్, కుమార్‌గౌడ్, శ్రీకాంత్, నర్సింలు, నాయకులు ఈట గణేష్, కొమ్ము క్రిష్ణ, చంద్రపాల్‌రెడ్డి, కుమార్‌గౌడ్, గోపాల్‌రెడ్డి, వెంకట్‌రాంరెడ్డి పాల్గొన్నారు.

శివపార్వతుల పరిణయోత్సవం



కేశంపేట, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): కేశంపేటలోని అమృత లింగేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం శివపార్వతుల కల్యాణాన్ని కమనీయంగా నిర్వహించారు. మఠం బసవేశ్వర్-సునంద దంపతులు కల్యాణాన్ని జరిపించారు. కిసాన్‌నగర్ వేద పాఠశాల అధ్యాపకుడు సంగయ్య మంత్రోచ్ఛరణల మధ్య పార్వతీపరమేశ్వరుల కల్యాణ తంతును నిర్వహించారు. లోక కల్యాణార్థం స్వామివారల కల్యాణాన్ని నిర్వహించినట్టు తెలిపారు. వేడుకను తిలకించేందుకు భక్తులు తరలివచ్చారు. కార్యక్రమంలో ప్యాక్స్ డైరెక్టర్ మంఠం చంద్రశేఖర్-చందన, సిద్ధేశ్వర్-పరమేశ్వరి, కోటేశ్వర్-కీర్తి, మహేశ్-శ్రావణి దంపతులు, మాజీ ఎంపీపీ విశ్వానాథం, చిన్న మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థినులతో కలిసి భోజనం చేస్తున్న రాధికాగుప్తా

గురుకులంలో అదనపు కలెక్టర్ తనిఖీ

కీసర, మార్చి 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని అంకిరెడ్డిపల్లి గల జ్యోతిరావు పూలే బాలికల గురుకుల పాఠశాలను శుక్రవారం అదనపు కలెక్టర్ రాధికాగుప్తా తనిఖీ చేశారు. మధ్యాహ్నం విద్యార్థినులకు వండిన ఆహారాన్ని పరిశీలించి, బాలికలతో కలిసి భోజనం చేశారు. రోజూ మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా? అని విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. రుచి, శుచికరమైన భోజనం అందించాలని నిర్వాహకులకు సూచించారు. ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకుని బాగా చదువుకోవాలని విద్యార్థినులకు చెప్పారు.

మీ సేవ కేంద్రం సీజ్

ధారూరు, మార్చి 21(ఆంధ్రజ్యోతి): ధారూరులోని మీ సేవ కేంద్రంలో వినియోగదారుల నుంచి ఎక్కువ డబ్బు వసూలు చేస్తున్నారని అందిన ఫిర్యాదుతో తహసీల్దార్ సాజిదాబేగం కార్యాలయ అధికారులను పంపి విచారణ జరిపించారు. అక్రమాలు నిజమని తేలడంతో శుక్రవారం మీ సేవ కేంద్రాన్ని సీజ్ చేశారు. ధారూరులోని మీ సేవ కేంద్ర నిర్వాహకులు వినియోగదారుల నుంచి ప్రభుత్వం నిర్దేశించిన ఫీజుకన్నా అధికంగా వసూలు చేస్తున్నారని దోర్నాల్‌కు చెందిన మహిపాల్, మరికొందరు తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. స్పందించిన ఆమె ఆర్ఐ స్వప్న, జూనియర్ అసిస్టెంట్ భీంకుమార్‌లను మీ సేవ కేంద్రానికి పంపి విచారణ చేయించారు. నిర్ణీత చార్జి రూ.45కు బదులు రూ.75, ఆధార్ అప్డేట్‌కు రూ.100కు బదులు రూ.150 తీసుకున్నట్లు రుజువైంది. అలాగే కులం, ఆదాయం వివిధ సర్టిఫికెట్ల కోసం చేసుకునే దరఖాస్తుదారుల నుంచీ ఈ మీ సేవ కేంద్రంలో ఎక్కువ డబ్బు తీసుకుంటున్నట్టు ఫిర్యాదులందాయి. దీంతో అధికారులు మీ సేవ కేంద్రాన్ని సీజ్ చేశారు. విచారణ నివేదికను కలెక్టర్‌కు పంపిస్తామని తహసీల్దార్ తెలిపారు.



మీ సేవ సెంటర్‌ను సీజ్ చేస్తున్న అధికారులు

కొత్త మండలాలు..

పాతచోటే కార్యాలయాలు

● ఇబ్బందుల్లో ప్రజలు ● పట్టించుకోని పాలకులు

కొత్తూర్, మార్చి 21(ఆంధ్రజ్యోతి): మండలాల పునర్విభజన జరిగి ఏళ్లు గడుస్తున్నా.. పాత మండల కేంద్రాల్లోనే ఆఫీసులు కొనసాగుతున్నాయి. దీంతో అదే దూరాభారంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కొత్తూర్ మండలంలోని నందిగామ నూతన మండలమైంది. కొత్తూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గతంలో చాకలిదానిగుట్టతండా వద్ద నిర్మించారు. చాకలిదానిగుట్ట తండా నందిగామ మండలంలో ఉంది. అయితే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కొత్తూర్‌కు మార్చలేదు. అలాగే నందిగామ ట్రాన్స్‌కో ఏఈ కార్యాలయం కొత్తూర్ కార్యాలయ ఆవరణలోని క్వార్టర్స్‌లోనే ఉంది. కార్యాలయాలు పొరుగు మండలాల్లో ఉండడంతో ప్రజలకు కొత్తగా చేకూరే ప్రయోజనమేమీ లేకుండా పోయింది. ఆరోగ్య కేంద్రం కొత్తూరుకు 3కిలోమీటర్లు ఉండడంతో ప్రజలు అక్కడికి వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారు. అలాగే కొత్తూర్ మున్సిపాలిటీలో బస్తీ దవాఖానా ఏర్పాటు చేయాల్సి ఉన్నా దాన్నీ పట్టించుకునే వారే లేరు. ట్రాన్స్‌కో ఏఈ ఆఫీసు కొత్తూర్‌లో ఉండడంతో నందిగామ మండల ప్రజలు ఇబ్బందులకు గురైతున్నారు. ఏళ్లుగా ప్రభుత్వ కార్యాలయాలు సొంత మండలంలో నిర్మించకపోవడం ఏమిటని, కొత్తగా మండలాలు చేసి ఏం ఉపయోగం అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. దీనికి పాలకులే సమాధానం చెప్పాలంటున్నారు.



నందిగామ మండలంలో ఉన్న కొత్తూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

బస్తీ దవాఖానాను ఏర్పాటు చేయాలి



కొత్తూర్ ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం ప్రజలకు అందుబాటులో లేదు. పట్టణానికి మూడు కిలోమీటర్ల దూరం ఉంది. దీంతో ప్రజలు పట్టణంలో ఉన్న ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్తున్నారు. ఉన్నతాధికారులు వెంటనే కొత్తూర్ మున్సిపాలిటీలో బస్తీ దవాఖానాను ఏర్పాటు చేయాలి.

\- శివకుమార్‌చారి, కొత్తూర్

కరెంటు ఆఫీసును నందిగామకు తరలించాలి



నందిగామ మండలంగా ఏర్పడి ఏళ్లు గడుస్తున్నా.. విద్యుత్ కార్యాలయం కొత్తూర్‌లోనే కొనసాగుతోంది. కొత్త మండలం ఏర్పాటైనా విద్యుత్ పనుల కోసం పాత మండల కేంద్రానికే వెళ్లాల్సి వస్తోంది. మరి మాకు దూరం ఏం తగ్గినట్టు? బైక్‌లు, ఆటోల్లో వెళ్లి రావాల్సి వస్తోంది. డబ్బు, సమయం వృథా అవుతున్నాయి. అధికారులు వెంటనే కార్యాలయాన్ని నందిగామకు తరలించాలి.

\- వెంకటేశ్‌గౌడ్, నందిగామ

కొత్తగడి గురుకుల ఘటనపై విచారణ పూర్తి

» భావోద్వేగంతోనే పైఅంతస్తు నుంచి దూకిన విద్యార్థిని
» రాష్ట్ర బీసీ కమిషన్‌కు నివేదికిచ్చిన కలెక్టర్

వికారాబాద్, మార్చి 21(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కొత్తగడి సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల భవనం మొదటి అంతస్తుపై నుంచి ఓ విద్యార్థిని దూకి గాయపడ్డ ఘటనపై కలెక్టర్ ప్రతీక్‌జైన్ జరిపించిన విచారణ నివేదిక శుక్రవారం తెలంగాణ బీసీ కమిషన్‌కు చేరింది. విద్యార్థిని తబిత చదువుల పరంగా ఒత్తిడి ఎదుర్కోవడం, సహ విద్యార్థినుల ఎదుట విమర్శలకు గురి చేయడం వంటి కారణాలతో భావోద్వేగానికి గురై బిల్డింగ్‌పై నుంచి దూకినట్టు విచారణలో వెల్లడైంది. కొత్తగడి బాలికల గురుకుల పాఠశాలలో పదో తరగతి చదువుతున్న మర్పల్లి మండలం కొత్లాపూర్‌నకు చెందిన తబిత ఫిబ్రవరి 24న పాఠశాల మొదటి అంతస్తుపై నుంచి దూకడంతో కాలికి తీవ్ర గాయమైంది. ఉపాధ్యాయులు తనతో అవమానకరంగా మాట్లాడడం వల్లే తబిత ఆత్మహత్యాయత్నం చేసిందనే దూకిందనే ఆరోపణలు వ్యక్తమయ్యాయి. దీనిపై విచారణ చేసి నివేదిక అందజేయాలని తెలంగాణ బీసీ కమిషన్ కలెక్టర్ ప్రతీక్‌జైన్‌ను ఆదేశించింది. దీంతో విచారణకు కలెక్టర్ ఓ కమిటీని వేశారు. ఈ కమిటీ బృందం ఆత్మహత్యాయత్నానికి దూకడానికి దారితీసిన పరిస్థితులపై మార్చి 4న తబిత విచారణ జరిపింది. విద్యార్థినులు, స్నేహితురాళ్లు, ఉపాధ్యాయులు, ప్రిన్సిపాల్‌తో మాట్లాడారు. తబిత మానసికంగా సున్నితమైన విద్యార్థిని, చిన్న విషయానికైనా తీవ్రంగా ప్రతిస్పందిస్తుందని, గతంలోనూ కొన్ని ఘటనల్లో తీవ్రంగా స్పందించిందని విచారణలో గుర్తించారు. పరీక్షలు రాయకపోవడం, రికార్డులు పూర్తి చేయకపోవడం వంటివి జరిగాయని విచారణలో గుర్తించారు. తరచూ క్రమశిక్షణా చర్యలకు గురికావడం, తోటి విద్యార్థినుల ముందు తనను విమర్శించడం వంటి వాటితో అవమానకరంగా భావించేదని గుర్తించారు. ఫిబ్రవరిలో జరిగిన వీడ్కోలు కార్యక్రమంలో ఓ ఉపాధ్యాయురాలు తన గురించి చెడుగా మాట్లాడినట్లు తెలుసుకున్న తబిత ఆ మరుసటి రోజు ఫిబ్రవరి 24న పాఠశాల పైఅంతస్తు నుంచి దూకిందని నివేదికలో పేర్కొన్నారు. ఘటన జరిగిన వెంటనే సిబ్బంది, టీచర్లు తబితను ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారని, అక్కడ ఎక్స్‌రే సదుపాయం లేక ప్రైవేట్ ఆసుపత్రిలో స్కానింగ్ తీయించారని, ఈ విషయమై తబిత తల్లిదండ్రులకు సమాచారమిచ్చారని పేర్కొన్నారు.

కౌన్సెలింగ్ ఇప్పించాలి

సున్నిత మనస్కురాలైన ఇలాంటి బాలికలకు నిపుణులతో కౌన్సెలింగ్ ఇప్పించాలని కమిటీ సూచించింది. ఇలాంటి ఘటనలు చోటుచేసుకోకుండా ఏ జాగ్రత్తలు తీసుకోవాలో సూచనలు చేసింది. విద్యార్థుల ఇబ్బందులను తెలియజేసేలా పాఠశాలల్లో ఫిర్యాదు బాక్సులను ఏర్పాటు చేయాలని, బాక్సుల తాళాలు తహసీల్దార్, డీడబ్ల్యువో కార్యాలయంలోని ఐసీపీఎస్ వద్ద ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించింది. వచ్చే ఫిర్యాదులను సమీక్షించి వాటి పరిష్కారానికి చర్యల కోసం కలెక్టర్లకు తెలియజేయాలని ప్రభుత్వానికి సూచించింది. భావోద్వేగ, మానసిక సవాళ్లను ఎదుర్కొనే విద్యార్థుల కోసం ప్రొఫెషనల్ కౌన్సెలింగ్ సేవలను పొందేలా ఐసీపీఎస్ విభాగంతో పాఠశాలలను సమన్వయం చేయాలని పేర్కొంది. తీవ్ర ఘటనలు చోటుచేసుకుంటే వెంటనే పరిశోధించి దిద్దుబాటు చర్యలు తీసుకునేందుకు అవసరమైన అంతర్గత యంత్రాంగాలను పాఠశాలలు కలిగి ఉండాలని తన నివేదికలో కమిటీ సూచించింది.

ఇందిరమ్మ ఇంటిని 400స్క్వేర్ ఫీట్లలోనే నిర్మించాలి

విస్తీర్ణం పెంచితే బిల్లులు రావు ● హౌసింగ్ డీఈ ఖలీముద్దీన్

తాండూరు రూరల్, మార్చి 21(ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్లు 400 స్క్వేర్ ఫీట్ల స్థలంలోనే నిర్మించాలని తాండూరు హౌసింగ్ డీఈ ఖలీముద్దీన్ అన్నారు. శుక్రవారం చెనిగేష్‌పూర్‌లో పైలెట్ ప్రాజెక్టు కింద నిర్మిస్తున్న మాణెమ్మ, మమత ఇళ్ల నిర్మాణాన్ని పరిశీలించారు. 400 స్క్వేర్ ఫీట్ల కంటే ఎక్కువ విస్తీర్ణంలో నిర్మిస్తే బిల్లు రాదన్నారు. ఇంత మేర నిర్మాణానికే జియో ట్యాగింగ్ చేశామని, ఎక్కువ విస్తీర్ణంలో కట్టుకుంటే ఇబ్బందులొస్తాయని చెప్పారు. లబ్ధిదారులకు ఇంటి నిర్మాణ వివరాలను తెలియజేయాలని పంచాయతీ కార్యదర్శి వీరేశాన్ని ఆదేశించారు. ఆయన వెంట హౌసింగ్ ఏఈ రహీం ఉన్నారు.



నూతన డ్రగ్‌ను చూపిస్తున్న రవీంద్రయాదవ్

టీబీ నియంత్రణకు ఔషధం

» వికారాబాద్ డిప్యూటీ డీఎంహెచ్‌వో రవీంద్రయాదవ్

తాండూరు, మార్చి 21(ఆంధ్రజ్యోతి): 6 హెచ్‌పీ ఔషదం ఇస్తే జీవితంలో టీబీ సోకదని వికారాబాద్ డిప్యూటీ డీఎంహెచ్‌ఓ రవీంద్రయాదవ్ అన్నారు. శుక్రవారం తాండూరు పట్టణంలోని ఆర్ట్ సెంటర్‌లో నూతన డ్రగ్‌ను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ హెచ్ఐవీ బాధితులకు టీబీ సోకకుండా గతంలో ఆరు నెలలపాటు మందులు వాడాల్సి వచ్చేదని తెలిపారు. ప్రస్తుతం 6హెచ్‌పీ (600ఎంజీ)తో 28 రోజులకు కుదించడం జరిగిందని, ఇది వాడితే టీబీ సోకదని వెల్లడించారు. వ్యాధిగ్రస్తులు ఇక భయపడాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. కార్యక్రమంలో డాక్టర్ సమీవుల్లా, ఫార్మాసిస్టులు రవీకుమార్, రమేష్, నర్సులు, సిబ్బంది పాల్గొన్నారు.

రేషన్ కార్డుల్లో కుటుంబీకులందరి పేర్లూ రావాలి



తాండూరు, మార్చి 21(ఆంధ్రజ్యోతి): రేషన్ కార్డుల్లో ఒకరి, ఇద్దరు పేర్లు నమోదు చేయడం ఏమిటని, కుటుంబీకులందరి పేర్లూ రావాలని బీజేపీ అనుబంధ మహిళా మోర్చా రాష్ట్ర కార్యదర్శి, మాజీ కౌన్సిలర్ సాహు శ్రీలత డిమాండ్ చేశారు. ఆమె శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. వృద్ధులకు, దివ్యాంగులకు పెన్షన్ రావడం లేదని, విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, హెల్త్ కార్డులు ఇవ్వడం లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అంటే కరెంట్ కోతలే కాదని, పథకాల్లోనూ కోతలే అన్నారు. 24వ వార్డులో 250మందికిపైగా రేషన్ కార్డులకు దరఖాస్తు చేస్తే 45మందికే కార్డులొచ్చాయన్నారు. వాటిలో 31కార్డుల్లో ఒక్కరిపేరే వచ్చిందని, దీన్ని బట్టే కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యం స్పష్టంగా తెలుస్తోందన్నారు.

భూములు లాక్కుంటే ప్రజా తిరుగుబాటే

తలకొండపల్లి, మార్చి 21(ఆంధ్రజ్యోతి): గ్రీన్‌ఫీల్డ్, ట్రిపుల్ ఆర్, ఫోర్త్ సిటీల పేరుతో ప్రభుత్వం రైతుల భూములు లాక్కునే ప్రయత్నం చేస్తోందని కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే గుర్కా జైపాల్‌యాదవ్ అన్నారు. రైతుల పొలాలు బలవంతంగా తీసుకుంటే ప్రజాతిరుగుబాటు తప్పదని హెచ్చరించారు. చీపునుంతలలో శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం నియంతపాలన చేస్తోందని విమర్శించారు. ప్రభుత్వం భూములు తీసుకుంటే ఎకరానికి రూ.3కోట్లు చెల్లించాలని డిమాండ్ చేశారు. చిత్తశుద్ధి ఉంటే గ్యారంటీలన్నీ అమలు చేయాలని జైపాల్ డిమాండ్ చేశారు. సమావేశంలో నరోత్తమ్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి, బాలకుమార్‌గౌడ్, గంప శ్రీను తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి బయోచార్ తయారీపై శిక్షణ

ఘట్‌కేసర్ రూరల్, మార్చి 21(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ వర్థాలతో బయోచార్(బొగ్గుపొడి) తయారీపై నేటి(శనివారం) నుంచి రెండు రోజులపాటు శిక్షణ ఇస్తామని పిట్టల అర్గానిక్ ఫామ్ నిర్వాహకుడు పిట్టల శ్రీశైలం తెలిపారు. ఘట్‌కేసర్ మున్సిపాలిటీ, అంకుశాపూర్‌లోని పిట్టల ఆర్గానిక్ ఫామ్‌లో శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. వ్యవసాయ వ్యర్థాలతో బయోచార్ చేసే పద్ధతి రైతులకు మేలు జరుగుతుందని తెలిపారు. దీనివల్ల భూసారం పెరిగి పంటల దిగుబడి సైతం పెరుగుతుందన్నారు. బయోచార్ నిపుణుడు డాక్టర్ సాయిభాస్కర్‌రెడ్డి పాల్గొని శిక్షణ ఇస్తారని వెల్లడించారు. రైతులు ముందస్తుగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 99599 96597, 70187 84740 నంబర్లను సంప్రదించాలని ఆయన కోరారు.

రేపు జిల్లా కాంగ్రెస్ సన్నాహక సమావేశం

» హాజరు కానున్న పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్

రంగారెడ్డి అర్బన్, మార్చి 21(ఆంధ్రజ్యోతి): ఈ నెల 23న జిల్లా కాంగ్రెస్ పార్టీ సన్నాహక సమావేశాన్ని నిర్వహిస్తామని డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి శుక్రవారం తెలిపారు. ఆరంగర్‌లోని గ్రాండ్ ఫంక్షన్ హాల్‌లో ఉదయం 10గంటలకు నిర్వహించే ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ హాజరవుతారని పేర్కొన్నారు. జిల్లా మంత్రి శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యేలు, సీడబ్ల్యూసీ నేతలు, కార్పొరేషన్ చైర్మన్లు హాజరవుతారని చెప్పారు. నాయకులు, కార్యకర్తలు, ఎన్ఎస్‌యూఐ, యూత్, మహిళా కాంగ్రెస్ నాయకులు హాజరుకావాలని కోరారు.

శంకరస్వాముల పుణ్య సంస్మరణోత్సవం



కెంపిన మఠంలో రుద్రాభిషేకం నిర్వహిస్తున్న చెన్నబసవప్రభుస్వామి

వికారాబాద్, మార్చి 21(ఆంధ్రజ్యోతి): ధర్మాన్ని కాపాడే వారిని ధర్మం కాపాడుతుందని కత్తెపల్లి సచ్చిదానంద షట్‌స్థల పీఠ సంస్థాపకులు ఉమాపతయ్య స్వామి అన్నారు. ఆలంపల్లి కెంపినమఠం పూర్వ పీఠాధిపతి శంకరస్వాముల వార్షిక పుణ్య సంస్మరణోత్సవం శుక్రవారం పీఠాధిపతి చెన్నబసవప్రభు స్వామి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆగమ పరిషత్ ఉపాధ్యక్షుడు మఠపతి సాంబశివశర్మ నేతృత్వంలో ధ్వజారోహణం, శంకరప్రభు గురు పీఠానికి రుద్రాభిషేకం, పూజాదికాలు నిర్వహించారు. అనంతరం శివానుభవ సత్సంగ కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. హిందూ ధర్మం గొప్పదని, సనాతనమైందన్నారు. బసవేశ్వరుడు చూపిన మార్గంలో మనం నడుచుకోవాలన్నారు. తంగెడుపల్లి పీఠాధిపతి శివయోగి శివాచార్యులు మాట్లాడుతూ.. ఆధ్యాత్మిక చింతనలో శంకరస్వాములు ప్రత్యేకత నిలుపుకొన్నారన్నారు. చెన్నబసవప్రభు స్వామి మాట్లాడుతూ.. ప్రతొక్కరూ ధర్మాన్ని అనుసరించాలన్నారు. హాజరైన మఠపతి సాంబశివశర్మ, నాగయ్య స్వామి, విరూపాక్ష దేవర శంకరప్రభుస్వాములు హిందూ ధర్మ వైశిష్ట్యాలను, ఆచారాలను వివరించారు. కార్యక్రమంలో వీరశైవ సమాజం అధ్యక్షుడు విజయకుమార్, ఆత్మలింగం, వీరేశ్, మఠం శివానందం, చంద్రశేఖరస్వామి, అశోక్‌స్వామి, పార్వతయ్య, పి.మల్లేశం, విశ్వం పంతులు, విద్యాసాగర్, భద్రప్ప, కోటిలింగం, వీరశైవ, అక్కమహాదేవి సమాజాలు, వీరశైవ యువదళ్ సభ్యులు పాల్గొన్నారు.

రాత్రివేళ డ్రోన్ల చక్కర్లు

చేవెళ్ల, మార్చి 21(ఆంధ్రజ్యోతి): మండలంలో రెండు రోజులుగా రాత్రిపూట డ్రోన్ కెమెరాలు హల్‌చల్ చేస్తున్నాయి. గ్రామాల్లో రాత్రిపూట డ్రోన్ కెమెరాలను ఎగరేస్తున్నారు. చేవెళ్ల, కందవాడ, ఊరెళ్ల, సింగప్పగూడ, కేసారం గ్రామాల్లో రాత్రి 9గంటల సమయంలో డ్రోన్ కెమెరాలను ఎగరేస్తున్నారు. దీంతో ఏం జరుగుతోందని ప్రజలు భయందోళన చెందుతున్నారు. ఈ విషయమై ఇన్‌స్పెక్టర్ భూపాల్ శ్రీధర్‌ను వివరణిస్తూ.. కందవాడలో ఆర్‌హెచ్ రీసెర్చ్ కంపెనీ నిర్వాహకులు పరిశోధనలో భాగంగా పోలీసు శాఖ నుంచి అనుమతి తీసుకునే డ్రోన్ కెమెరాలతో ఎగరేస్తున్నారని చెప్పారు.



సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ పురుషోత్తంరెడ్డి

విద్యార్థులను తీర్చిదిద్దడమే లక్ష్యం

మొయినాబాద్ రూరల్, మార్చి 21(ఆంధ్రజ్యోతి): తమ యూనివర్సిటీలో విద్యార్థులను సమాజానికి ఉపయోగపడేలా తీర్చిదిద్దడమే లక్ష్యం అని చైతన్య డీమ్డ్ యూనివర్సిటీ చైర్మన్ పురుషోత్తంరెడ్డి అన్నారు. శుక్రవారం హిమాయత్‌నగర్‌లోని వర్సిటీ క్యాంపస్‌లో విలేకరులతో మాట్లాడారు. భారత ప్రభుత్వ విద్యా మంత్రిత్వ శాఖ అనుమతులతో తమ డీమ్డ్ విశ్వవిద్యాలయాన్ని వరంగల్ నుంచి హైదరాబాద్‌కు విస్తరించామని తెలిపారు. శనివారం స్నాతకోత్సవానికి నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో వర్సిటీ చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ సాత్విక్‌రెడ్డి, వీసీ శంకర్ లింగం, రిజిస్ట్రార్ రవీందర్, పీఆర్వో రాంబాబు పాల్గొన్నారు.

'మహేశ్వరాన్ని ఫ్యూచర్‌సిటీలో కలిపేలా కృషి'

మహేశ్వరం, మార్చి 21(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న ఫ్యూచర్‌సిటీలో మహేశ్వరం మండలాన్ని కలిపేలా అసెంబ్లీలో మాట్లాడుతానని ఎమ్మెల్యే పి.సబితారెడ్డి అన్నారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాజునాయక్ ఆధ్వర్యంలో నాయకులు శుక్రవారం సబితను కలిశారు. వారితో ఆమె మాట్లాడుతూ.. మహేశ్వరాన్ని మహానగరంగా మారుస్తానని చెప్పిన సీఎం రేవంత్‌రెడ్డి.. ఇప్పుడు రెండు గ్రామాలనే ఫ్యూచర్‌సిటీలో కలపడం ఏమిటని ప్రశ్నించారు. కార్యక్రమంలో చంద్రయ్య, పాండుయాదవ్, వెంకటేశ్వర్‌రెడ్డి, నందం, సుధీర్‌గౌడ్, నవీన్, మోతీలాల్ పాల్గొన్నారు.

నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు



శంకర్‌పల్లి మున్సిపల్ కమిషనర్ యోగేష్

ఫటా ఫట్

శంకర్‌పల్లి, మార్చి 21(ఆంధ్రజ్యోతి): వేసవిలో నీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్లు శంకర్‌పల్లి మున్సిపల్ కమిషనర్ యోగేష్ తెలిపారు. ప్రతీరోజు శంకర్‌పల్లి పట్టణానికి 1.6ఎమ్ఎల్‌డీ (16లక్షల లీటర్లు)ల నీరు మిషన్ భగీరథ ద్వారా సరఫరా అవుతున్నదని, పట్టణానికి 1.8ఎమ్ఎల్‌డీల నీరు అవసరం ఉన్నదని, ఆ లోటును పూడ్చేందుకు ట్యాంకర్లు, బోర్ల ద్వారా నిత్యం నీటిని సరఫరా చేస్తున్నామని.. తదితర విషయాలు 'ఆంధ్రజ్యోతి'తో ఆయన పంచుకున్నారు.

ప్రశ్న: నీటి ఎద్దడిపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు.

జవాబు : శంకర్‌పల్లి పట్టణంలో 116బోర్లకు గాను.. కేవలం 80వరకు మాత్రమే పనిచేస్తున్నాయి. మైనారిటీ కాలనీలో కొత్త బోరు వేశాం. మోటారు సైతం బిగిస్తున్నాము. రెండు ట్యాకర్ల ద్వారా నిత్యం నీరందిస్తున్నాం. పాడైన బోర్లు, పైపులైన్లకు మరమ్మతులు చేపట్టాం.

ప్రశ్న: అమృత్ పథకం కింద ఎన్ని నిధులు వచ్చాయి. ఎన్ని వాటర్ ట్యాంకులు నిర్మించనున్నారు?

జవాబు: శంకర్‌పల్లి పట్టణానికి అమృత్ పథకంలో భాగంగా సుమారు రూ.32కోట్లు వచ్చాయి. ఎస్ఎమ్ కాలనీ, టీచర్స్ కాలనీ, సింగాపురం, దుర్గా ఎన్‌క్లేవ్, ప్రభుత్వాసుపత్రి ప్రాంగణం, బొప్పన్న వెంచర్ కాలనీ ప్రాంతాల్లో వాటర్‌ట్యాంకులు నిర్మిస్తున్నాం. కొత్త పైపులైన్లను వేస్తున్నాం.

ప్రశ్న: ఒకవేళ తాగునీటి సమస్య తలెత్తితే మంజీర వాటర్ సరఫరా చేస్తారా?

జవాబు: మిషన్ భగీరథ నీరు సరిపోని పక్షంలో మంజీర వాటర్‌ను సప్లయ్ చేయడానికి తగిన చర్యలు తీసుకుంటాం. ఈమేరకు ఉన్నతాధికారుల అనుమతి కోరుతాం.

తెరుచుకోని పల్లె దవాఖానాలు

● డాక్టర్ల నిర్లక్ష్యం.. రోగులకు అందని వైద్యం!




ఉదయం 11.30 గంటల వరకూ తాళం తీయని పర్వేద, గణేష్‌నగర్ పల్లె దవాఖానాలు

శంకర్‌పల్లి, మార్చి 21(ఆంధ్రజ్యోతి): శంకర్‌పల్లి ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిధిలోని పల్లె దవాఖానాలకు సుస్తి చేసింది. వాటిని తెరవకుండా ఉండటంతో రోగులు అవస్థలు పడుతున్నారు. నిత్యం ఇదే తీరు ఉండటంతో వారు అటువైపు కనీసం కన్నెత్తి చూడటం లేదు. రోగులకు వైద్య సేవలు మరింత అందుబాటులోకి తేవాలన్న సదుద్దేశంతో ప్రభుత్వం ఏర్పాటు చేసిన పల్లె దవాఖానాలు కేవలం అలంకారప్రాయంగా మిగిలిపోతున్నాయి. ప్రభుత్వం 2023లో శంకర్‌పల్లి మండలంలోని ఉప వైద్యకేంద్రాలను పల్లె దవాఖానాలుగా మార్చింది. శంకర్‌పల్లి ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిధిలో 6 పల్లె దవాఖానాలు, టంగటూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో 4 పల్లె దవాఖానలు ఏర్పాటు చేసింది. అయితే, ఈ దవాఖానలు ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు తెరిచి ఉండాలి. అందులో డాక్టర్‌తో పాటుగా ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు అందుబాటులో ఉండి సేవలందించాలి. బీసీ, షుగర్, గర్భిణీలకు నిరంతర పరీక్షలు, సాధారణ చికిత్సలు, జాతీయ ఆరోగ్య కార్యక్రమాలను నిర్వహించడం లాంటివి చేయాల్సి ఉంటుంది. ఇదిలా ఉంటే, బుధ, సోమ, శని వారం పల్లె దవాఖానాల్లో అందుబాటులో ఉంటూ వైద్య సేవలందించాలి. మిగతా రోజుల్లో పల్లె దవాఖానల పరిధిలోని గ్రామాలలో సిబ్బంది ఇంటింటికీ తిరుగుతూ వైద్యసేవలపై అవగాహన కల్పించాల్సి ఉంటుంది. ఈక్రమంలో పల్లె దవాఖానాల పనితీరుపై 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధి శుక్రవారం పరిశీలించగా ఆసక్తికరమైన విషయాలు వెలుగులోకి వచ్చాయి. పర్వేదలోని పల్లె దవాఖాన ఉదయం 11.30 గంటలు కావస్తున్నా తాళం వేసే ఉంది. అదేవిధంగా శంకర్‌పల్లి మున్సిపల్ పరిధిలోని గణేష్‌నగర్ కాలనీలోని పల్లె దవాఖానాకు సైతం తాళం వేసి ఉంది. గణేష్‌నగర్ పల్లె దవాఖానాకు ఆసుపత్రి బోర్డు కూడా లేకపోవడం గమనార్హం. శంకర్‌పల్లి కూరగాయల మార్కెట్‌లో గల పల్లె దవాఖానకు చెందిన డాక్టర్ ప్రశాంతి, మహాలింగపురం పల్లె దవాఖానకు చెందిన డాక్టర్ అనూషలు పదో తరగతి పరీక్షల విధుల్లో ఉన్నారని శంకర్‌పల్లి ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యురాలు రేవతి తెలిపారు. అదేవిధంగా బుల్కాపూర్, రావులపల్లి డాక్టర్లు శోభ, ప్రియలు సెలవుల్లో ఉన్నారని చెప్పారు.

వైద్యం సక్రమంగా అందడం లేదు



పల్లె దవాఖాన వేళలకు తెరవకపోవడంతో వైద్యం అందడం లేదు. అడిగేవారు లేక వైద్యు లు ఇష్టానుసారంగా ప్రవర్తిస్తున్నారు. దవాఖాన కు ఎప్పుడు వచ్చినా తాళం వేసి ఉంటోంది. దాంతో వైద్యం అందడం లేదు. అధికారులు ఇప్పటికైనా తగిన చర్యలు తీసుకోవాలి.

- జగదీశ్, పర్వేద

ఎప్పుడు వస్తారో తెలియదు



గణేష్ నగర్ పల్లె దవాఖానకు ఇప్పటివరకు బోర్డు కూడా ఏర్పాటు చేయలేదు. అప్పుడప్పుడు వస్తారు తప్పితే... నిత్యం డాక్టర్ రాక ఇబ్బందిగా ఉంది. రోజు డాక్టర్ వస్తే ఇక్కడే చూపించుకుంటాము. పేదవారిమైన తమపై పెద్దలు దయతలచి డాక్టర్‌ను నిత్యం తమ బస్తీకి పంపాలి.

- నటరాజ్, గణేష్‌నగర్, శంకర్‌పల్లి మున్సిపాలిటీ

99.01%

(5వ పేజీ తరువాయి)

అనుమతించారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 249 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. సైబరాబాద్ పరిధిలోని 122, హైదరాబాద్‌లో రెండు, రాచకొండ పరిధిలో 125 పరీక్ష కేంద్రాలున్నాయి. 249 కేంద్రాల్లో 51,604 మంది రెగ్యులర్ విద్యార్థులకు గాను 51,096 మంది పరీక్షలకు హాజరయ్యారు. 99.01 హాజరు శాతం నమోదైంది. 508 మంది గైర్హాజరయ్యారు. అలాగే 94 మంది ప్రైవేట్ విద్యార్థులుండగా 71 మంది హాజరయ్యారు. 23 మంది గైర్హాజరయ్యారు. 75.53 హాజరు శాతం నమోదైంది. మాస్ కాపీయింగ్‌కు పాల్పడకుండా 10 మంది ఫ్లయింగ్ స్క్వాడ్స్, 249 మంది సిట్టింగ్ స్క్వాడ్స్ విధులు నిర్వర్తించారు. 22 మంది విద్యార్థులకు ఒక ఇన్విజిలేటర్ చొప్పున విధుల్లో పాల్గొన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. కేంద్రాలకు సమీపంలో ఉన్న జిరాక్స్ సెంటర్లను మూసివేసేలా రాచకొండ కమిషనర్ సుధీర్‌బాబు చర్యలు తీసుకున్నారు. విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు సకాలంలో చేరుకునేందుకు ఆర్టీసీ అధికారులు అదనపు బస్సులు నడిపారు.

పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి : కలెక్టర్

పదో తరగతి పరీక్షల్లో మాస్ కాపీయింగ్ జరగకుండా పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ నారాయణరెడ్డి అధికారులు, పోలీసులకు సూచించారు. శుక్రవారం రాజేంద్రనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరీక్ష నిర్వహణ తీరును పరిశీలించారు. ఎండలు తీవ్రంగా ఉన్న నేపథ్యంలో విద్యార్థులకు తాగునీటిని అందుబాటులో ఉంచాలని సూచించారు. విద్యార్థులను క్షుణ్ణంగా తనిఖీ చేసి కేంద్రాల్లోకి అనుమతించాలన్నారు. కేంద్రాల్లో ఏర్పాట్లను చీఫ్ సూపరింటెండెంట్ పర్యవేక్షించాలని ఆదేశించారు. కలెక్టర్‌తో డీఈవో సుశీందర్‌రావు ఉన్నారు.



యాచారం : నందివనపర్తి పరీక్ష కేంద్రం వద్ద రూమ్ నెంబర్ సరిచూసుకుంటున్న బాలికలు



ఆమనగల్లు : సహాయకునితో పరీక్ష హాల్‌లోకి వెళుతున్న విద్యార్థి అజయ్‌కుమార్



ఇబ్రహీంపట్నం : ప్రభుత్వ ఉన్నత పాఠశాల వద్ద విద్యార్థుల సందడి

సహాయకుడితో పరీక్ష రాసిన విద్యార్థి

ఆమనగల్లు : ఆమనగల్లు మున్సిపాలిటీ విఠాయిపల్లికి చెందిన అజయ్‌కుమార్ ఆమనగల్లు బాలుర ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై గాయపడ్డాడు. పరీక్ష రాయలేని స్థితిలో ఉండి పరీక్ష కేం ద్రం చీఫ్ సూపరింటెండెంట్‌కు సమస్యను వివరించాడు. సహాయకునితో పరీక్షలు రాయడానికి అనుమతించాలని కోరగా.. సీఎస్ తొమ్మిదో తరగతి చదువుతున్న మరో విద్యార్థిని సహాయకుడిగా పరీక్ష రాయడానికి అనుమతి ఇచ్చారు. ఆమనగల్లు బాలికల ఉన్నత పాఠశాలలో పరీక్ష రాశాడు.



షాద్‌నగర్ అర్బన్ : కుంటబడి పాఠశాల ఎదుట పరీక్ష రాసేందుకు వేచి ఉన్న విద్యార్థులు, వారి వెంట వచ్చిన కుటుంబ సభ్యులు

క్రైం కార్నర్

పాపం చిన్నారి!

● ఏడాది పాపపై నుంచి ట్రాలీ ఆటో వెళ్లడంతో మృతి

శంషాబాద్ రూరల్, మార్చి 21(ఆంధ్రజ్యోతి): ఏడాది వయసున్న చిన్నారిపై నుంచి ట్రాలీ ఆటో వెళ్లడంతో మృతిచెందింది. నాగర్‌కర్నూల్ జిల్లా మరికల్‌కు చెందిన కాకమ్ శివశంకర్ బతుకు దెరువు నిమిత్తం శంషాబాద్ మండలంలోని రాళ్లగూడకు వచ్చాడు. కూలి పనులు చేస్తూ కుటుంబ సభ్యులతో జీవనం సాగిస్తున్నాడు. రోజు మాదిరిగా కూలి పనుల నిమిత్తం శివశంకర్ శుక్రవారం భార్యతో పాటు కూతురు కీర్తి(1)ని వెంట తీసుకెళ్లాడు. ఈక్రమంలో ఓ ఇంటి వద్ద పని చేస్తుండగా కూతురు అక్కడే పక్కన ఆడుకుంటోంది. ఆ సమయంలో ఇంటి నిర్మాణానికి సంబంధించిన సిమెంట్ లోడ్‌తో వచ్చిన ట్రాలీ ఆటోను డ్రైవర్ అజాగ్రత్తగా నడుపుకుంటూ చిన్నారి కీర్తిపై నుంచి పోనిచ్చాడు. దాంతో చిన్నారి అక్కడికక్కడే మృతి చెందింది. డ్రైవర్ వివరాలను ఆరా తీయగా రాళ్లగూడ గ్రామానికి చెందిన చాంద్‌అలీ అని తెలిసింది. శివశంకర్ శంషాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నరేందర్‌రెడ్డి చెప్పారు.

బాలికను మోసం చేసిన వ్యక్తి రిమాండ్

యాచారం, మార్చి 21(ఆంధ్రజ్యోతి): పెళ్లి చేసుకుంటానని మాయ మాటలతో బాలికను తన వెంట తీసుకెళ్లిన వ్యక్తిని శుక్రవారం అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు సీఐ నందీశ్వర్‌రెడ్డి తెలిపారు. మొండిగౌరెల్లిలోని సాయిఫౌల్ట్రీఫాంలో సునీల్‌కుమార్ అనే వ్యక్తి అక్కడే పని చేస్తున్న ఓ బాలికను పెళ్లిచేసుకుంటానని నమ్మించి ఈనెల 19న తనతో పాటు తీసుకెళ్లాడు. దాంతో బాలిక కనిపించకపోవడంతో ఆమె తండ్రి సంజయ్‌ప్రసాద్ యాచారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తులో భాగంగా సునీల్‌కుమార్‌పై అనుమానం రావడంతో అదుపులోకి తీసుకొని విచారించగా బాలికను తీసుకెళ్లినట్లు చెప్పాడు. దాంతో అతన్ని శుక్రవారం రిమాండ్‌కు పంపినట్లు సీఐ తెలిపాడు.

గోడను ఢీకొన్న బైక్.. యువకుడి దుర్మరణం

● మరో వ్యక్తికి తీవ్ర గాయాలు

ఆదిభట్ల, మార్చి 21(ఆంధ్రజ్యోతి): ఆదిభట్ల పోలీస్ స్టేషన్ పరిధి రావిర్యాల వద్ద శుక్రవారం రాత్రి బైక్ అదుపుతప్పి రోడ్డు పక్కన గోడను ఢీకొట్టడంతో యువకుడు తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందగా.. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసుల కథనం ప్రకారం.. తుర్కయాంజాల్‌కు చెందిన అరుణ్(21) తన స్నేహితుడితో కలిసి కేటీఎం మోటార్ సైకిల్‌పై పహడీషరీఫ్ వైపు నుంచి రావిర్యాల వైపు వస్తుండగా రావిర్యాల చెరువు వద్ద మూల మలుపులో మోటార్ సైకిల్ అదుపుతప్పి పక్కనే ఉన్న గోడను ఢీకొట్టింది. దాంతో అరుణ్ తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందాడు. మరొకరికి తీవ్ర గాయాలుకాగా ఆసుపత్రికి తరలించారు. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

తల్లీకొడుకు అదృశ్యం



బాబుతో కామిని

చేవెళ్ల, మార్చి 21(ఆంధ్రజ్యోతి): జాకెట్ కుట్టించుకుని వస్తానని ఇంటి నుంచి బయటకు వెళ్లిన తల్లీకుమారుడు అదృశ్యమైన ఘటన చేవెళ్ల పోలీస్‌స్టేషన్ పరిధి ముడిమ్యాల్‌లో చోటుచేసుకుంది. ఎస్సై సంతోష్‌రెడ్డి కథనం మేరకు.. ముడిమ్యాల్ గ్రామానికి చెందిన యంజాల మహేందర్ భార్య కామిని(24) ఈనెల 20న జాకెట్ కుట్టించుకుని వస్తానని ఇంట్లో చెప్పి రెండేళ్ల కుమారుడితో కలిసి బయటకు వెళ్లిపోయింది. రాత్రి వరకూ ఇంటికి రాకపోవడంతో గ్రామంతోపాటు బంధువుల వద్ద ఆచూకీ కోసం వెతికినా ఫలితం లేకపోయింది. శుక్రవారం భర్త మహేందర్ పోలీస్‌లకు ఫిర్యాదు చేశాడు. మిస్సింగ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఎమ్మార్పీఎస్ నాయకుల సంబురాలు



శంషాబాద్ రూరల్ : కాచారంలో మంద కృష్ణ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు

మొయినాబాద్ రూరల్, మార్చి 21(ఆంధ్రజ్యోతి): ఎస్సీ రిజర్వేషన్ బిల్లు పాస్ చేయడంపై మండలంలోని నాగిరెడ్డిగూడలో ఎమ్మార్పీఎస్ సభ్యులు గురువారం రాత్రి సంబురాలు నిర్వహించుకున్నారు. మండలాధ్యక్షుడు కొండిగారి మహేందర్, నాగిరెడ్డిగూడ అధ్యక్షుడు జీనుకుంట అనిల్ దీప్ కుమార్‌లు మాట్లాడుతూ మాదిగల పోరాటం ఫలించిందని.. ఇకపై ఏకతాటిపై ఉందామన్నారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. మందకృష్ణ మాదిగకు కృతజ్ఞతా సభను ఏర్పాటు చేశారు. దర్గుపల్లి రాజు, భిక్షపతి, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

శంషాబాద్ రూరల్ : 30 ఏళ్ల సుదీర్ఘ పోరాటంతోనే ఎస్సీ వర్గీకరణకు మోక్షం లభించిందని ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు మద్దిలేటి మాదిగ అన్నారు. కాచారంలో మాజీ సర్పంచ్ మైలారం భిక్షపతి ఆధ్వర్యంలో మంద కృష్ణ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. రాష్ట్ర కార్యదర్శి కొత్తూరు రమేష్ మాదిగ, రత్నం మాదిగ, జిల్లా నాయకులు చిట్టిబాబు, రాజు మాదిగ, రాష్ట్ర యువనాయకుడు కిరణ్‌కుమార్ మాదిగ, నర్సింహులు పాల్గొన్నారు. అలాగే పెద్దతూప్రలో ఎమ్మార్పీఎస్ మండల మాజీ అధ్యక్షుడు నల్లోల చెన్నకేశవ్ ఆధ్వర్యంలో మంద కృష్ణ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు.

రాత్రివేళ డాబాలపై నిద్రించవద్దు

యాచారం, మార్చి 21(ఆంధ్రజ్యోతి): ఎండ తీవ్రతతో ఉక్కపోత భరించలేక ఇంటి డాబాలపై నిద్రించరాదని ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు చెప్పారు. శుక్రవారం మండలంలోని నజ్దిక్‌సింగారం గ్రామంలో ఆయన పర్యటించి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఇంట్లో విలువైన ఆభరణాలు నగదు దాచుకోరాదన్నారు. బంగారు, వెండి ఆభరణాలు బ్యాంకుల్లో దాచుకోవాలని కోరారు. ఎవరైనా అపరిచితులు కనిపిస్తే వెంటనే డయల్ 100కు సమాచారమందించాలని కోరారు.

నిర్వహణకు నిధులేవి?

(5వ పేజీ తరువాయి)

సామర్థ్యంతో వేదికలను నిర్మించారు. టేబుళ్లు, కుర్చీలు, మైక్ సిస్టంతో పాటు ఇతర సామగ్రిని సమకూర్చింది. ఏఈవో, రైతుబంధు సమితి కో-ఆర్డినేటర్ కోసం రెండు గదులు, రైతుల సమావేశం కోసం ఒక మీటింగ్ హాలుతో కూడిన రైతు వేదికలను నిర్మించారు. వ్యవసాయ శాఖ సేవలను రైతులకు మరింత చేరువ చేసేందుకు ప్రభుత్వం క్లస్టర్లను ఏర్పాటు చేసింది. ప్రతీ 5 వేల ఎకరాలకు ఒక ఏఈవోను నియమించి వారి సేవలను అందుబాటులోకి తెచ్చేందుకు రైతు వేదికలను నిర్మించింది. ఒక్కో రైతువేదిక నిర్వహణ కోసం తొలుత నెలకు రూ.3 వేలు ఇచ్చింది. ఈ నిధులు సరిపోకపోవడంతో వ్యవసాయ శాఖ ప్రతిపాదనల మేరకు రైతు వేదికల నిర్వహణకు రూ.9 వేల చొప్పున అందజేస్తామని గత ప్రభుత్వం ప్రకటించింది. 2022 ఏప్రిల్ నుంచి ఆగస్టు వరకు 5 నెలలకు గాను రైతు వేదికల నిర్వహణ కోసం నిధులను విడుదల చేసింది. ఐదు నెలల పాటు రూ. 3 వేలు చొప్పున అందించిన ప్రభుత్వం ఆ తర్వాత రూ.9 వేలు పెంచింది. పెంచినప్పటి నుంచి ఇప్పటి వరకు ఒక్కపైసా విడుదల కాలేదు. 83 రైతు వేదికలకు సంబంధించి 31 నెలలకు నిర్వహణ నిధులు రూ. 2,31,57,000 పేరుకుపోయాయి. దీంతో విద్యుత్ చార్జీలు, పారిశుధ్య నిర్వహణ, మరమ్మతులు, స్టేషనరీ, రైతుశిక్షణ, తాగునీటి సౌకర్యాలకు నిధులు ఖర్చు చేయాల్సి ఉంది. అయితే ప్రభుత్వం నిర్వహణ నిధులు విడుదల చేయకపోవడతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని వ్యవసాయ అధికారులు (ఏవో), మండల వ్యవసాయ విస్తరణ అధికారులు (ఏఈవోలు) వాపోతున్నారు. ఒక్కో రైతు వేదికకు రూ.2.79 లక్షలు రావాల్సి ఉందని, మా సొంత డబ్బులను ఖర్చు చేయాల్సి వస్తుందంటున్నారు. ఒక్కో వేదికకు రూ.10వేల నుంచి రూ.12వేల చొప్పున విద్యుత్ బకాయిలు పేరుకుపోయినట్లు చెబుతున్నారు. రైతు సమావేశాలు జరిగిన సందర్భంలో కనీసం తాగునీరు, చాయ్‌కి కూడా డబ్బులు లేవని ఏఈవోలు వాపోతున్నారు. ఒక్కో కేంద్రానికి మినీ భూసార పరీక్ష ల్యాబ్ కిట్లను అందజేసి వీటి ద్వారా వేదికల్లో పరీక్షలు చేయాల్సి ఉన్నా నిధులు లేకపోవడంతో ఈ ప్రక్రియ కూడా అటకెక్కింది.

ఊరికి దూరంగా..

జిల్లాలో 83 రైతు వేదికలు ఉండగా వీటిలో సగానికి పైగా గ్రామాలకు దూరంగానే ఉన్నాయి. ఒక్కో రైతు వేదిక పరిధిలో 5 వేల ఎకరాలు ఉండేలా ఐదారు గ్రామాలను చేర్చారు. కానీ.. వీటిని ఊరికి దూరంగా నిర్మించడంతో రైతులు వచ్చేందుకు ఆసక్తి చూపడం లేదు. ప్రతీ రైతు వేదికకు ఒక విస్తరణ అధికారి బాధ్యులుగా ఉండగా.. వీరిలో 50 శాతానికిపైగా మహిళలే ఉన్నారు. ఊరికి దూరంగా ఉన్న రైతువేదికల్లో వీరు ఒక్కరే విధులు నిర్వర్తించేందుకు భయపడుతున్నారు. కనీసం అటెండర్ కూడా లేకపోవడంతో ఏఈవోనే తాళం తీసుకుని శుభ్రం చేసుకుని విధులు నిర్వర్తించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఏఈవోలు తప్పనిసరిగా వారి క్లస్టర్ పరిధిలోని రైతువేదిక నుంచి జియో ట్యాగింగ్ ద్వారా తమ హాజరు నమోదు చేసుకోవాలి. లేదంటే ఆబ్సెంట్ పడుతుంది. అందుకే ప్రతీ రోజు విధిగా రైతు వేదికకు వెళ్లి హాజరు నమోదు చేసుకున్న తర్వాతే క్షేత్రస్థాయికి వెళ్లాల్సి వస్తుంది. ఊరుకు దూరంగా నిర్మించిన రైతు వేదికలకు భద్రత లేకుండా పోయింది.

దృశ్యశ్రవణం ఎలా?

శాస్త్రవేత్తలు, వ్యసాయాధికారులు, రైతులు సమావేశమై సాగు సమస్యలు, ఆధునిక పద్ధతులపై చర్చించేందుకు వీలుగా రైతు వేదికల్లో వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. మొదటి విడతగా జిల్లాలో మొయినాబాద్, చిలుకూరు, కందుకూరు, మంచాల, నందిగామ, శంషాబాద్, మల్కారం, రైతు వేదికలను వీడియో కాన్ఫరెన్స్ యూనిట్స్ కోసం ఎంపిక చేశారు. ప్రతీ మంగళవారం రైతునేస్తం నిర్వహిస్తున్నారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లాస్థాయి వ్యవసాయాధికారులు, శాస్త్రవేత్తలు రైతులతో నేరుగా మాట్లాడి పంటల సాగు విధానం, చీడపీడల నివారణ, ప్రభుత్వ పథకాలు తదితర వాటిపై సలహాలు ఇచ్చేలా ఈ కార్యక్రమాన్ని రూపొందించారు. ఇదంతా బాగానే ఉన్నా 31 నెలలుగా నిర్వహణ నిధులు విడుదల చేయకపోతే ఈ కార్యక్రమాలను ఎలా నిర్వహిస్తామని ఏఈవోలు ప్రశ్నిస్తున్నారు.

రైతు వేదికల్లో అటెండర్లను నియమించాలి



రైతులకు మేలు చేసేలా నిర్మించిన రైతు వేదికల్లో అటెండర్లు, స్వీపర్లను నియమించాలి. రైతు వేదికలను శుభ్రం చేసేవారే లేరు. ఊరికి దూరంగా ఉండే రైతు వేదికల్లో మహిళా ఏఈవోలు విధులు నిర్వర్తించేందుకు భయపడుతున్నారు.

- రాజేందర్‌రెడ్డి,
మండల వ్యవసాయాధికారి, చౌదరిగూడ

నిర్వహణ ఖర్చులు భరిస్తున్నాం

నిధులు విడుదల చేయకపోవడంతో రైతు వేదికల నిర్వహణ ఖర్చులను మేమే భరిస్తున్నాం. చిలుకూరు, కనకమామిడి పరిధిలో రైతు వేదికలున్నాయి. మొదట్లో కొంత నిర్వహణ ఖర్చులు మంజూరు చేసినప్పటికీ.. తర్వాత పైసా కూడ విడుదల కాలేదు. విద్యుత్ చార్జీలు తడిసి మోపెడవుతున్నాయి.

- అనురాధ,
మండల వ్యవసాయాధికారి, మొయినాబాద్

ప్రభుత్వ స్కూళ్లపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

పంజాగుట్ట, మార్చి 21(ఆంధ్రజ్యోతి): తెలంగాణలోని ప్రభుత్వ పాఠశాలలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, ఉపాధ్యాయులు తమ బాధలు చెప్పుకోవడానికి అపాయింట్మెంట్ ఇవ్వాలని చౌదరిగూడ మండలం ఇంద్రానగర్ జడ్పీహెచ్‌ఎస్ హెచ్ఎం కొమ్ము ఉదయ్ కుమార్ సీఎం రేవంత్‌రెడ్డికు విజ్ఞప్తి చేశారు. తన వీఆర్ఎస్‌ను ఆమోదించి, పెండింగ్ బిల్స్ ఇవ్వాలని కోరారు. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ స్వరాష్ట్రంలో విద్యారంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తారని భావించినా ఆ స్థాయిలో ప్రాధాన్యత లభించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పదోన్నతులు, బదిలీల విషయంలో ఉపాధ్యాయులు తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతున్నారని, సీఎం రేవంత్‌రెడ్డిని కలిసేందుకు పలుమార్లు ప్రయత్నించినా ప్రయోజనం లేకుండా పోయిందన్నారు. సీఎం అపాయింట్మెంట్ ఇస్తే బాధలు చెప్పుకోవడమే కాకుండా సమస్యలను వివరిస్తానని తెలిపారు.

క్రీడల్లోనూ రాణించాలి : కేఎస్ రత్నం



విజేతలకు షీల్డ్, నగదు అందిస్తున్న రత్నం

చేవెళ్ల, మార్చి 21(ఆంధ్ర జ్యోతి): యువత చదువుతో పాటు క్రీడాల్లోనూ రాణించాలని మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం తెలిపారు. పర్మన్న ట్రస్ట్ ఆధ్వర్యంలో చేవెళ్ల పట్టణ కేంద్రంలో నెల రోజులుగా నిర్వహిస్తున్న మండల స్థాయి క్రికెట్ టోర్నీ శుక్రవారం ముగిసింది. మొత్తం 44 టీమ్‌లు పాల్గొన్నాయి. ఫైనల్ మ్యాచ్‌లో ఊరెళ్ల, రామన్నగూడ గ్రామాల జట్లు తలపడ్డాయి. ఊరెళ్ల జట్టు విజయం సాధించగా.. రూ.50వేల నగదు, షీల్డ్, రన్నర్ జట్టుకు రూ.25వేల నగదు, షీల్డ్‌ను ట్రస్ట్ చైర్మన్ పెద్దోళ్ల ప్రభాకర్, రత్నంలు అందించారు. రత్నం మాట్లాడుతూ నెలరోజుల పాటు టోర్నమెంట్ నిర్వహించి క్రీడాకారులను ప్రోత్సహించినందుకు పర్మన్న మెమోరియల్ టోర్నమెంట్ చైర్మన్ పెద్దోళ్ల దయాకర్‌ను అభినందిస్తున్నట్లు తెలిపారు. బీజేపీ చేవెళ్ల మండలాధ్యక్షుడు అనంతరెడ్డి, యువ నాయకుడు డాక్టర్ వైభవ్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు అరుణా నర్సింలు, జహంగీర్, నాయకులు పాల్గొన్నారు.

ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

కందుకూరు, మార్చి 21(ఆంధ్రజ్యోతి): ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని, లేనియెడల ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని సీఐటీయూ మండల కార్యదర్శి బుట్టి బాల్‌రాజ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంతో పాటు రాచులూరు, లేమూరులోని ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులకు వినతి పత్రం ఇచ్చారు. శుక్రవారం కలెక్టరేట్‌ను ముట్టడించేందుకు వెళుతున్న వారిని ముందస్తు అరెస్టు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. శ్రీలత, రజిత, మంజుల, అఫ్రోజ్, ముంతాజ్‌బేగం, సురేఖ, హేమలత పాల్గొన్నారు.

సామాజిక న్యాయం కాంగ్రెస్‌తోనే సాధ్యం

కడ్తాల్, మార్చి 21(ఆంధ్రజ్యోతి): సామాజిక న్యాయం కాంగ్రెస్‌తోనే సాధ్యమని మాజీ ఎమ్మెల్యే వంశీచందర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో పవిత్ర రంజాన్ మాసం ఉపవాస దీక్షలను పురస్కరించుకొని శుక్రవారం మండల మాజీ కో ఆప్షన్ సభ్యుడు ఎండీ జహంగీర్ బాబా ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. వంశీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సామూహిక నమాజ్ అనంతరం ముస్లింలకు పండ్లు అందించి రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, డీసీసీ ప్రధాన కార్యదర్శి బిక్యానాయక్, మండలాధ్యక్షుడు బీచ్యానాయక్ ఉన్నారు.



వంశీచందర్‌రెడ్డిని సన్మానిస్తున్న మైనారిటీ నాయకులు

సంక్షిప్తంగా..

కొత్తూర్/షాద్‌నగర్ రూరల్ : ముదిరాజ్‌లను బీసీ డీ గ్రూప్ నుంచి బీసీ ఏ గ్రూప్‌కు మార్చాలని డిమాండ్ చేస్తూ ఛలో అసెంబ్లీ ముట్టడి పిలుపు మేరకు స్థానిక ముదిరాజ్ నాయకులను పోలీసులు అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. మున్సిపల్ వైస్‌చైర్మన్ రవీందర్, ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు రామకృష్ణ, తదితరులు అరెస్ట్ అయిన వారిలో ఉన్నారు. షాద్‌నగర్ ముదిరాజ్ నాయకులను పోలీసులు అరెస్ట్ చేశారు. అరెస్టైన వారిలో సంఘం తాలూకా అధ్యక్షుడు మంగ వెంకటేష్, శ్రీధర్ వర్మ, కానుగు అంతయ్య, అందె పైలయ్య, అశోక్ తదితరులు ఉన్నారు.

మాడ్గుల : కొల్కులపల్లిలోని కొన్ని కాలనీలు, రాజీవ్‌నగర్ తండాకు, బంజారాహిల్స్ కాలనీకి సరిపడా తాగనీరు అందటం లేదని గ్రామస్తులు, తండావాసులు అధికారుల ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఈమేరకు మిషన్ భగీరథ తాగునీటి సరఫరా చేసేందుకు గాను పదివేల లీటర్ల సామర్థ్యం గల నీటి సంపు నిర్మాణానికి ఎస్డీఎఫ్ రూ.8లక్షలు మంజూరైనట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనివాస్ తెలిపారు. సంపు నిర్మాణానికి ఆమనగల్లు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ భట్టు కిషన్‌రెడ్డి భూమిపూజ చేశారు.

కందుకూరు : ప్రతీ ఆదివారం మండల కేంద్రంలోని కందుకూరు రహదారిలో కూరగాయల సంతతో పాటు మేకల సంతను ప్రభుత్వ స్థలంలోనే నిర్వహించేందుకు తగిన ఏర్పాట్లు చేయాలని ఏఎంసీ డైరెక్టర్ ప్రశాంత్‌కుమార్ కోరారు. కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఎగ్గిడి జగదీశ్వర్‌తో కలిసి ఎంపీడీవో సరితకు వినతి పత్రం ఇచ్చారు. ఆమె స్పందించి కలెక్టర్ నారాయణరెడ్డికి నివేదిక పంపనున్నట్లు చెప్పినట్లు వారు పేర్కొన్నారు.

కందుకూరు : బీఆర్ఎస్ మండల ఉపాధ్యక్షుడు దామోదర్ గౌడ్ పులిమామిడిలో ఎన్ఆర్‌జీఎస్ నిధులు రూ.5లక్షలతో కార్యదర్శి రాజుగౌడ్‌తో కలిసి సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. మాజీ వార్డుసభ్యులు బి.శ్రీశైలం, తదితరులున్నారు.

తలకొండపల్లి : మండల పరిధిలోని చీపునుంతలలోని సీతారామాంజనేయస్వామి ఆలయంలో ప్రథమ వార్షికోత్సవాలు శుక్రవారం నిర్వహించారు. హోమం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, రాష్ట్ర సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షుడు గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు సీఎల్ శ్రీనివాస్‌యాదవ్‌లు హాజరయ్యారు.

షాద్‌నగర్ అర్బన్/చౌదరిగూడ : బీజేపీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన రాజ్‌భూపాల్‌గౌడ్‌ను షాద్‌నగర్ బీజేపీ నాయకులు ఘనంగా సన్మానించారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అందె బాబయ్య, పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డిల ఆధ్వర్యంలో వేర్వేరుగా శంషాబాద్‌కు తరలివెళ్లి రాజ్‌భూపాల్ గౌడ్‌కు అభినందనలు తెలిపారు. దేపలి అశోక్‌గౌడ్, భూపాలాచారి, కక్కునూరి వెంకటేష్‌గుప్త, గున్నాల చంద్రశేఖర్, శ్రీనివాస్, గణేష్, రమేష్, ఆంజనేయులు, తదితరులున్నారు.

మంచాల : ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత, బీసీ రిజర్వేషన్ బిల్లు, యువ వికాసం పథకం అమలులోకి తెచ్చిన సందర్భాన్ని పురస్కరించుకుని యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో మంచాలలో సంబరాలు జరుపుకున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిల చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. రాష్ట్ర నేతలు విష్ణువర్ధన్‌రెడ్డి, రమాకాంత్‌రెడ్డి, వెదిరె సికిందర్‌రెడ్డి, రాఘవ కురుమ, గుండెమోని జయమ్మ, నరేందర్‌రెడ్డి, జయానందం, తదితరులున్నారు.

షాద్‌నగర్ రూరల్ : ఉపాధి హామీలో పని చేస్తున్న కూలీల సమస్యలు పరిష్కారం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీను నాయక్ డిమాండ్ చేశారు. ఫరూఖ్‌నగర్ మండలం బూర్గుల శివారులో జరుగుతున్న పని ప్రదేశానికి వెళ్లి కూలీలతో మాట్లాడారు. పీవో అరుణకు సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రం ఇచ్చారు.

కడ్తాల్ : సీఎం రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వంపై తప్పుడు ప్రచారాలు, అసంబద్ధమైన పోస్టులతో ప్రచారం చేస్తున్న డిగ్‌టీవీ పేరడీ చానల్‌పై చర్యలు తీసుకోవాలని కడ్తాల యువజన కాంగ్రెస్ నాయకులు అన్నారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేశారు.

షాబాద్ : గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి అన్నారు. మాచన్‌పల్లిలో ఎస్‌సీపీ నిధులు రూ.5లక్షలతో సీసీ రోడ్డు వేసినందుకు గ్రామస్తులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

కడ్తాల్ : మెనూప్రకారం నాణ్యమైన ఆహారమందించాలని తహసీల్దార్ ముంతాజ్ కోరారు. మైసిగండి గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేశారు.